# తత్త్వజ్ఞానము

ఆధ్యాత్మిక మాసపత్రిక

e - పత్రిక

## ఏప్రిల్ - 2020

## మతాతీత ఆధునిక మానవతా దేవాలయము




## శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము

పిఠాపురం - 533 450

visit us at :

www.sriviswaviznanspiritual.org
www.uardt.org
https://www.facebook.com/svvvap1472
https://www.facebook.com/uardt



ది. 2-3-2020 తునిలో జరిగిన సర్వమత సామరస్య సభలో "విశ్వశాంతి ప్రతిజ్ఞ" చేయుచున్న వివిధ మతసంస్థల ప్రతినిధులు శ్రీరామారావు, బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి, శ్రీ సూఫీ సులేమాన్ షా, ఇస్లాం మత ప్రతినిధి, శ్రీ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, హిందూ మత ప్రతినిధి, సద్గురువర్యులు, శ్రీ మహోదయ జగదీశ్వరరావు, భౌద్ధమత ప్రతినిధి, శ్రీ భవర్‌లాల్ జైన్, జైనమత ప్రతినిధి, శ్రీ గురుచరణ్ సింగ్, సిక్కుమత ప్రతినిధి, డా॥ ఎమ్.ఎస్. విలియమ్స్, క్రైస్తవమత ప్రతినిధి.

ది. 29-2-2020 పిఠాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ నందు అజీమా జహేరమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ ఆర్.ఒ. ప్లాంట్‌ను ప్రారంభించుచున్న సద్గురువర్యులు మరియు శ్రీ అహ్మాద్ ఆలీషా, శ్రీ సి.హెచ్. ప్రతాప్, జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్, శ్రీ నరసింహారావు, ఆర్.టి.ఓ, కాకినాడ, డా॥ సూర్యకుమారి, హాస్పిటల్ సూపరింటెండెంట్, డా॥ బి.విజయ్‌శేఖర్ గారు





ది. 29-2-2020 పిఠాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ నందు అజీమా జహేరమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ ఆర్.ఒ. ప్లాంట్ శిలా ఫలకము ప్రారంభోత్సవము చేయుచున్న సద్గురువర్యులు శ్రీ అహ్మాద్ ఆలీషా, డా॥ బి.విజయ్‌శేఖర్ గారు

ది. 29-2-2020 పిఠాపురం ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. గవర్నమెంట్ హైస్కూల్‌లో ఉమర్ ఆలీషా రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కూలింగ్ ఆర్.ఒ. ప్లాంట్‌ను ప్రారంభించి విద్యార్థులకు మంచినీటిని అందించిన సద్గురువర్యులు మరియు శ్రీ అహ్మాద్‌ఆలీషా, శ్రీ అబ్దుల్‌నబీ, సబ్ ఇనస్పెక్టర్ పిఠాపురం. ప్రారంభోత్సవము చేయుచున్న సద్గురువర్యులు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వేణుగోపాల్, శ్రీ అహ్మాద్ ఆలీషా, శ్రీ హుస్సేన్‌షా, శ్రీ బలీల్‌షా, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న సేవా కార్యక్రమాలు



ది. 7-4-2020 ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా కరోనా వైరస్ వ్యాప్తి నిర్మూలన నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 1,00,000/- చెక్కును వ్యవసాయ మరియు సహకారశాఖామాత్యులు శ్రీ. కురసాల కన్నబాబు గారికి అందజేయుచున్న ట్రస్ట్ ప్రతినిధులు

ది. 26-2-2020న కాకినాడలో ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరోనా వైరస్ వ్యాధి నిరోధక ఉచిత హెూమియో మందులను రాష్ట్ర వ్యవసాయ మరియు సహకారశాఖామాత్యులు శ్రీ. కురసాల కన్నబాబు గారికి పంపిణీ చేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు.






ది. 25-2-2020 కాకినాడ ట్రస్ట్‌లో ఆధ్వర్యంలో కరోనా వైరస్ వ్యాధి నిరోధక ఉచిత హోమియో మందులను శ్రీ. ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకినాడ వారికి పంపిణీ చేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు

ది. 24-2-2020 కాకినాడ ట్రస్ట్ ఆధ్వర్యంలో కరోనా వైరస్ వ్యాధి నిరోధక ఉచిత హోమియో మందులను శ్రీ. ఆదాన్ నయీం అస్మి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, తూర్పుగోదావరి జిల్లా వారికి పంపిణీ చేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు



మతాతీత ఆధునిక మానవతా దేవాలయం

ESTD. 1472

PITHAPURAM

SRI VISWA VIZNANA VIDYA ADHYATMIKA PEETHAM

# శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము

**పిఠాపురం - 533 450**

**తూర్పు గోదావరి జిల్లా**

సంచిక : 21 సంపుటి : 3

## విషయ సూచిక


తుని సభా కార్యక్రమము

మహాసభలు - 2020 - 9-2-2020 మధ్యాహ్నం సభాకార్యక్రమము

వీరంపాలెం సభా కార్యక్రమము

అనుభవము - 1

కాంత - కనకము




వెల : రూ. **10-00**

# తుని సభా కార్యక్రమము

2-3-2020 తునిలో చతుర్థపీఠాధిపతి బ్రహ్మర్షి కహెనేషావలీ సద్గురువర్యుల దర్గావద్ద ఉదయం 9 గంటలకు సభ ఏర్పాటు చేయబడినది. ఈ సభకు శ్రీ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం హిందూమత ప్రతినిధి, సూఫీ సులేమాన్‌షా, ఇస్లాం మత ప్రతినిధి; డా. ఎమ్.ఎస్. విలియమ్స్, క్రైస్తవమత ప్రతినిధి; మహోదయ జగదీశ్వరరావు, బౌద్ధమత ప్రతినిధి; శ్రీ భవర్‌లాల్‌జైన్, జైనమత ప్రతినిధి; శ్రీ గురుచరణ్ సింగ్, సిక్కుమత ప్రతినిధి; శ్రీ రామారావు, బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ప్రతినిధి అతిథులుగా వేదిక నలంకరించారు. ముందుగా ఉమర్ ఆలీషా రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా నిరుపేద మహిళలకు కుట్టుశిక్షణ ఇచ్చే కేంద్రాన్ని స్వామి ఆవిష్కరించారు. దీనికి శ్రీ హుస్సేన్, కళాదంపతులు సహకరించారు. పంచముక్తి క్షేత్రాలలో అతి ముఖ్యమైన క్షేత్రం తుని అని స్వామి ఈ క్షేత్రం యొక్క అభివృద్ధి నివేదికను సభకు వివరించారు. శ్రీ ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం, హిందూ మత ప్రతినిధి మాట్లాడుతూ అన్ని మతాల సిద్ధాంతాలు మంచివే. కాని ఆచరణలో వాటిని పాటించుటలేదు. హిందూధర్మం, అహింస, సత్యము, ప్రేమ, సహనము ప్రబోధిస్తుంది. మతమౌఢ్యం పనికిరాదు. హిందూధర్మం కుటుంబవ్యవస్థ యొక్క ఐక్యతను నేర్పుతోందని అన్నారు. సూఫీసులేమాన్ షా, ఇస్లాం మత ప్రతినిధి మాట్లాడుతూ స్వార్థాన్ని విడిచిపెట్టాలి ధర్మాన్ని పాటించాలి ఒకే భగవంతుడిని, ఒకే గురువును ప్రార్థించాలి మతం అంటే మమతల ముద్దు. సద్గురువును గ్రహించిన జన్మధన్యము గురుప్రబోధిత మంత్రమును మననం చెయ్యాలి అని అన్నారు. రెవ విలియమ్స్ క్రైస్తవమత ప్రతినిధి మాట్లాడుతూ. ఉమర్ ఆలీషా గారు సత్పురుషులు, భిన్నత్వంలో ఏకత్వమే మన దేశం యొక్క గొప్పతనం పరోపకారం, ఆపద సమయంలో ఆదుకోవటం అనే విషయాలను ఉమర్ ఆలీషా గారు నేర్పుతూ ఆచరింపజేస్తున్నారని అన్నారు. మహోదయ

జగదీశ్వరరావు, బౌద్ధమత ప్రతినిధి మాట్లాడుతూ దేవతలుపుట్టిన ఈ దేశం మహోన్నతమైనది. కుల, మతాలతో సంబంధం లేని వ్యవస్థను బుద్ధుడు ప్రబోధించాడు. మంచి ప్రవర్తనతో మనస్సును ప్రశాంతపరచుకొనుటకు అష్టాంగ యోగము ప్రబోధించాడు బుద్ధుడు. దైవత్వం అంటే మంచితనం. సామాజిక బాధ్యతను తెలియపరచేదే బౌద్ధము. హక్కులు అనుభవించుటకాదు. బాధ్యతలు గుర్తెరగాలి అంటుంది బౌద్ధం అని అన్నారు. శ్రీ భవర్‌లాల్‌జైన్, జైన మత ప్రతినిధి మాట్లాడుతూ జైన మతం అహింసోపరమోధర్మ: అని ప్రబోధిస్తుంది. 2645 సంవత్సరాలు క్రితమే 24వ తీర్థంకరుడు జైనమతాన్ని స్థాపించారు. మహావీరుడు, బుద్ధుడు సమకాలికులు; దిగంబరులు, శ్వేతంబరులు ద్వారా జైనమతం వ్యాప్తిచెందుతోందని అన్నారు.

**శ్రీ గురుచరణ్ సింగ్,** సిక్కుమత ప్రతినిధి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురుసాంప్రదాయం ఉత్కృష్టమైనది.

ఉమర్ ఆలీషా గారు మానవతా మూర్తి. గురువే దైవస్వరూపం సిక్కుమతంలో భిక్షాటన నిషేధం. కష్టపడి జీవించాలి పరోపకారం చెయ్యాలి. సాధన ద్వారా భగవంతుని సన్నిధికి చేరాలని అన్నారు. శ్రీ రామారావు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి మాట్లాడుతూ ఆత్మపరిణామం, ఈశ్వరత్వం అంటే ఏమిటో సభకు వివరించారు. ఉమర్ ఆలీషా రూరల్ డవలప్‌మెంట్‌ట్రస్ట్ ద్వారా వేదికపై ఆశీనులైన అతిథులకు, పక్షుల ఆహారంగా ధాన్యపుకుచ్చులను అందజేసి వారి ప్రార్థనాలయాలలో పక్షులకు ఆహారం అందించవలసిందిగా స్వామి పిలుపునిచ్చారు. 27 మొక్కలను స్వామి పంపిణీచేసారు. సభానంతరము 25 మంది మంత్రోపదేశము పొందినారు. సుమారు 10,000 మందికి కరోనా వ్యాధినిరోధక హోమియో మందులను ఉచితంగా పంపిణీ చేయటం జరిగింది. వివిధ ప్రదేశముల నుండి వచ్చిన సభ్యులు స్వామిని దర్శించుకొని ప్రసాదములు స్వీకరించి తమ గృహములకు పయనమైనారు. చంటిపిల్లల తల్లులకు ఉచిత పాల సరఫరాను శ్రీ రామకృష్ణారెడ్డిగారు ఏర్పాటుచేసారు.

**స్వామి ప్రసంగము:** చతుర్థ పీఠాధిపతి కహెనేషావలీ సద్గురువర్యుల ఆరామంలో ప్రతి సంవత్సరము సర్వమత ప్రతినిధుల సభ ఏర్పాటుచేసి అన్ని మత ధర్మాలలో ఉండే ఆధ్యాత్మిక తాత్విక సందేశాలను వారి వారి ధర్మమార్గాలలో తెలియజేస్తూ వారందరూ సర్వేశ్వరుడైన భగవత్స్వరూపం యొక్క ఏకత్వాన్ని తెలియజేసిన మహోన్నతమైన ధర్మపథము. ధర్మము అన్నపుడు మానవుడు పుట్టుకమొదలుకొని అంత్యం వరకు ఈ భౌతిక జీవన మనుగడలో ఏవిధంగా జీవించాలి? ఏ విధంగా భగవంతుడిని అన్వేషించి ఏవిధంగా భగవత్తత్వాన్ని మానవతా విలువలతో అన్వయింపజేసుకొని మానవత్వపు విలువలతో కూడిన జీవితాన్ని ఏ విధంగా సాగించాలి? అనే అనేక కోణాలతో కూడిన అంశము ధర్మము. అందుచేత హైందవ, క్రైస్తవ, ఇస్లాం, జైన, బౌద్ధ, సిక్కు ధర్మాలను తీసుకొన్నట్లైతే ధర్మము అన్నప్పుడు ఆచరణ యోగ్యమైన, తాత్వికమైన జ్ఞానమార్గంలో మానవత్వపు విలువలతో కూడిన మానవత్వమే ఈశ్వరత్వముగా అనుసరిస్తూ పయనింపజేసే మహోన్నతమైన స్థితియే ధర్మమని చెప్పబడుచున్నది. కాబట్టి ఇక్కడ మత ప్రసక్తిలేదు. ఈ పీఠం 548 సంవత్సరాల ఘనచరిత్ర కలిగిన సనాతనమైన పీఠం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము. చతుర్థ పీఠాధిపతిగారు 1700 - 1750 మధ్యకాలంలో ఇక్కడ వసించినపుడు ఈ ప్రదేశము అంతా కూడా జనసంచారం లేని ప్రదేశము. అనేక రకాలైన జంతు జాలములతో కూడిన ప్రదేశము. వారి ఆధ్యాత్మిక తాత్విక ప్రవచనాల ద్వారా అనేకమంది వ్యాధిగ్రస్తులను ఆరోగ్యవంతులుగాచేస్తూ, వారి జీవన విధానంలో ఉండే విషయాలలో చక్కని సందేశాలను ఇస్తూ, తాత్త్విక జ్ఞానమార్గంవైపు దృష్టిని సారింపజేసి తాత్విక విధానంలో వారిని తీర్చిదిద్దటం జరిగింది. ఆ విధంగా వారి ఆధ్యాత్మిక తాత్విక శక్తిని గ్రహించి తరించిన వారు అనేకమంది ఆయన శిష్యులుగా ఏర్పడటం జరిగింది. వారు ఈ ప్రాంతంలోనే మహాసమాధినలంకరించటం జరిగింది. వారి తరువాత ఐదవ పీఠాధిపతి పిఠాపురం వెళ్ళిపోవడం అక్కడ ఆధ్యాత్మిక స్థిర నివాసం ఏర్పరచుకోవటం జరిగింది. ఈనాటి సమాజంలో చూస్తున్నాము.

మతాలు, కులాలు, వర్గాలు ప్రాంతీయ తత్వాలరూపంలో ఒకరినొకరు విబేధించుకొని అనేక రకాలైన వైషమ్యాలు, ద్వేషభావాలు ఏర్పరచుకొనుటచేత అనేక రకాలైన హింసావాదాలు ఏర్పడుచున్నాయి. వాటన్నిటినీ తొలగించుకోవాలన్నట్లైతే మనస్సును వశపరచుకోవాలి. మనస్సులో ఉండే జడకాలుష్యాన్ని తొలగించుకోవాలి. అప్పుడు మనస్సులో పవిత్రత ఏర్పడుతుంది. ఆ పవిత్రత మనలో ఉండే భగవంతుడిని అన్వేషించే మార్గంగా తెలియపరచబడుతుంది. కాని మనస్సు ఎప్పుడూ కూడా భౌతిక ప్రపంచంలో ఉండే ఆశాజనికమైన, భ్రాంతి జనికమైన అంశాలతో, అరిషడ్వర్గాలతో కూడి ఉద్రేకింపబడుతూ, అనేకరకాలైన ఒత్తిడి, అలజడులకు గురికాబడుతూ, అసహనము, అశాంతికి గురికాబడుతూ ఉండుటచేత మనస్సు కలుషితం కాబడుచున్నది. కలుషితంకాబడిన మనస్సును శుభ్రపరచి పవిత్రతను సమకూర్చేదే ఆధ్యాత్మిక తత్వము. మన దినచర్యలో మనం చేసే ప్రతి మంచి పని కూడా ఆధ్యాత్మికత అని చెప్పబడుచున్నది. ప్రతి మతం ప్రతి ధర్మం చెప్పే విషయం ఏమిటంటే ప్రతి మానవుడు మంచిపనిచేసినపుడు ఆ మానవుడు పరమేశ్వరూపంగా మారే అవకాశం ఏర్పడుతుంది. ఆ పరమేశ్వర స్వరూపాన్ని పొందితరింపజేసుకోవటానికి ఆధ్యాత్మిక తత్వాన్ని అనుభవరూపంలో తెలియజేసే తత్వం ఈ పీఠం యొక్క తత్వము. అందుచేత ఇది మతాతీత ఆధునిక మానవతా దేవాలయముగా చెప్పబడుచున్నది. ఇక్కడ మత ప్రసక్తిలేదు. అన్ని మత ధర్మాలలో ఉండే ఈశ్వరత్వం ఒక్కటే. వారి వారి మత విశ్వాసాలను బట్టి ఆ భగవంతుడిని అర్థించటం, పూజించటం జరుగుచున్నది. ఏకమేవాద్వితీయం బ్రహ్మ. బ్రహ్మ ఒక్కడే రెండుగాలేడు అనే విషయాన్ని తెలియజేసే తాత్విక జ్ఞానము ఈ పీఠం తత్వము. మన మనస్సును శుద్ధిపరచుకొనే మార్గాన్ని తత్వం ద్వారా తెలియజేస్తూ, తత్వంలో ఉండే విషయాలను మనస్సుకు అన్వయింపజేస్తూ, మనస్సులో ఉండే కలుషిత భావాలను తొలగించి పరిశుద్ధమైన విషయంగా మనస్సును తీర్చిదిద్దుకోగలిగినట్లైతే అప్పుడు మనస్సులో పవిత్రత ఏర్పడుతుంది. ఆ పవిత్రత

కలిగిన మనిషే ఆధ్యాత్మిక తాత్వికుడు. అటువంటి తాత్వికుడుగా పరిణామం చెందగలిగినపుడు మన జీవన విధానంలో చక్కని సంస్కృతి, సంస్కారం ఏర్పడుతుంది. ఆ మార్గంలో ప్రయాణించేసినట్లైతే మనలో ఉండే జీవాత్మే పరమాత్మ స్వరూపము అని తెలియబడుతుంది. **పరమాత్మ మనలో ఉన్నపుడు జీవాత్మ బ్రహ్మస్వరూపిగా పరిణామం చెందుతుంది.** కాబట్టి మనలోనే బ్రహ్మస్వరూపం నిండియున్నది అని చెపుతుంది ఆర్ష సిద్ధాంతం. తత్వమసి, అయమాత్మ, ప్రజ్ఞానం బ్రహ్మ, అహంబ్రహ్మాస్మి నేను బ్రహ్మస్వరూపిగా అయితిని. ప్రజ్ఞానం బ్రహ్మ అంటే జ్ఞానం ద్వారా బ్రహ్మస్వరూపం తెలియబడుతుంది అనే విషయం ఇక్కడ చెప్పబడుచున్నది. జ్ఞానం ఏవిధంగా ఉంది? ఈ సృష్టిలో ఉన్న అన్ని జీవరాసులలోకెల్లా ఉత్కృష్టమైన జీవి మానవుడు. మానవుడు తన మేధాశక్తిచేత గొప్పవాడుగా తెలియబడుచున్నాడు. ఈ జ్ఞానము ఎక్కడ, ఎవరు ఎలా ప్రసాదిస్తున్నారు అని అన్వేషించినపుడు ఆ జ్ఞానమనే మహత్తరశక్తి ఒక అవతారి, ఒక ప్రవక్త, ఒక ప్రభువు, ఒక జ్ఞాని, ఒక యోగినోట ప్రసాదింపబడింది. ప్రవచింపబడింది. ప్రబోధింపబడింది. ఒక భగవద్గీతగా, బైబిలుగా, ఒక ఖురానుగా, జైన, బౌద్ధ, సిక్కు ధర్మాల రూపంగా అనేక గ్రంథాలలో ఆయా విషయాలు విస్తరింపబడి ఈనాడు ఆ అద్భుతమైన విషయాలను మనం ఆచరిస్తున్నాము. అభ్యాసం చేస్తున్నాము. ఆ అభ్యాసం ద్వారా మనలో ఉండే తత్వం ఏమిటి? గ్రంథంలో చెప్పబడిన తత్వము ఏమిటి? అని విశ్లేషించి ఈ రెండింటిని అన్వయింపజేసుకోవచ్చు. మంచిని ఏవిధంగా అభ్యాసం చేయవచ్చు? అనే విషయ పరిజ్ఞానాన్ని మేధాశక్తి ద్వారా తెలుసుకోగలుగుచున్నాము. మనలో అద్భుతమైన శక్తి ఉంది. ఆ శక్తి పరమాత్మ శక్తి. ఆ శక్తిని తెలుసుకోవాలన్నట్లైతే జీవితం యొక్క అర్థాన్ని, పరమార్థాన్ని పొంది తరింపజేసేవే భగవద్గీత, ఖురాను, బైబిలు, జైన, బౌద్ధ ధర్మాలలో ఉండే గ్రంథాలు. ఇవన్నీ కూడా మనకు సంస్కారాన్ని సామాజిక తత్వాన్ని ఆధ్యాత్మిక తత్వాన్ని తెలియజేస్తున్నాయి. అన్నిటియందు చెప్పబడే విషయం ఒక్కటే. అదియే మానవత్వము. మానవత్వం మనలో ఎంత

ఉంది? ఏ స్థాయిలో ఉంది? ఏ రకంగా ఉంది? అనే విషయం మనం కొలబద్ధమానంగా నిర్ణయించుకోవాలన్నట్లైతే మనం చేసే ప్రతి మంచిపని ఆధ్యాత్మికత అని చెప్పబడుచున్నది. అది మానవత్వపు విలువలకు మార్గదర్శకమైన విధానము. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి నిద్రపోయేవరకు ఎన్ని మంచిపనులు చేస్తున్నాము? అనే దానిని మనస్సు ద్వారా విశ్లేషించుకొన్నట్లైతే మనలో ఆధ్యాత్మిక స్థాయి ఎంత ఉంది? అనే విషయం తెలియబడుతుంది. మానవత్వపు విలువల స్థితియొక్క పరిపూర్ణత్వమే మనలో ఉండే ఈశ్వరత్వము. మనలో రాక్షసుడు ఈశ్వరుడు ఇద్దరూ ఉన్నారు. మనం చేసే పనినిబట్టి రాక్షసుడు ఈశ్వరుడు తెలియబడతాడు. మనం ఈశ్వరుడు కావాలనుకొన్నప్పుడు మనస్సు ఏవిధంగా ఉండాలి? మన ఆధ్యాత్మికత ఏ స్థాయిలో ఉండాలి అనే దృక్పథంతో విశ్లేషించుకొన్నపుడు రాక్షసుడిని కోరుకోము. ఎందుకు కోరుకోవటంలేదు అన్నప్పుడు ముక్తినిపొందటానికి ఈశ్వరత్వం అవసరము. భ్రాంతి, మాయ, కుండలినీ, కాలము ఇవి రాక్షసత్వాన్ని తెలియజేస్తాయి. అందుచేత రాక్షసత్వాన్ని విడనాడి ఈశ్వరత్వంవైపు ప్రయాణం చెయ్యాలన్నట్లైతే మధ్య ఒక వారధి కావాలి. ఆవారధే సద్గురువర్యులు ప్రబోధించే జ్ఞానము. ఇది మంచి, ఇది చెడు అని తెలియజేసేవారే సద్గురువర్యులు. కబీర్‌దాసు చెపుతారు. భగవంతుడు, గురువు ఎదురుగా నిలబడినపుడు నీవు ఎవరిని అర్థిస్తావు అని ప్రశ్నించినపుడు గురువును మొట్టమొదట అర్థిస్తానని చెపుతారు. అంటే గురువు భగవంతుడు ఎలా ఉంటాడనే విషయాన్ని తెలియజేస్తున్నారు. అందుచేత గురువును ఆశ్రయించటం ద్వారా భగవతత్వం తెలియబడుతుంది. రాక్షసత్వం అందంగా కనిపిస్తుంది. ఈశ్వరత్వం అందవిహీనంగా ఉంటుంది తెలియబడదు. అందుచేత అందంగా ఉండే వస్తువును ఆశిస్తాము. ఈశ్వరత్వం అందవిహీనంగా ఉంది. కాని దీనిలో పరమార్థం ఉంది. దీని తెర తీసినట్లైతే నీకు అంతా కనిపిస్తుంది అని తెలియజేసేవారు సద్గురువర్యులు. రాక్షసత్వం దు:ఖాన్ని, కష్టాన్ని, ఒత్తిడిని కలుగజేసి జీవితాన్ని నష్టపరచే విధంగా ఉంది అనే విషయాన్ని తెలియజేసేవారు సద్గురువర్యులు.

అందుచేత మనం సద్గురువర్యులను ఆశ్రయించి వారు చూపించిన బాటలో ప్రయాణం చేసినట్లైతే జీవితంలో మహోన్నతమైన స్థాయిని పొందుతూ పరమార్థంవైపు ప్రయాణం చేసే అవకాశం ఉంది. ఉదాహరణకు ఈ జీవితనౌకను ఈ జీవితసాగరంలో పయనింపజేస్తున్నపుడు ఇహము అనే ఈ ఒడ్డు నుండి పరము అనే ఒడ్డుకు చేరాలన్నట్లైతే ఈ జీవితనౌకకు గురుతత్వమనే దిక్సూచి అవసరము. ఆ దిక్సూచిని అనుసరించి ప్రయాణంచేసినట్లైతే మనం ఏవైపు ఏ దిశకు ప్రయాణం చెయ్యాలనే విషయం తెలియబడుతుంది. ఆ దిక్సూచిని మనమనందరం మన జీవిత విధానంలో ఏర్పరచుకొన్నట్లైతే చక్కని ఆధ్యాత్మిక జ్ఞానము ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక జ్ఞానము మనస్సును శుద్ధిచేస్తుంది. ప్రతిరోజు స్నానమాచరించి మన దేహాన్ని శుభ్రపరచుకొంటున్నాము. కొన్ని వారాలపాటు స్నానము ఆచరించకుండా

ఉన్నట్లైతే దేహం దుర్గంధపూరితంగా మారిపోయి అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా మనస్సు కూడా అనేకరకాలైన దురాలోచనలతో మలినంకాబడుతూ ఉంటుంది. ప్రతిరోజూ మలినంకాబడిన మనస్సును ప్రతిరోజూ శుద్ధిపరచుకోవాలి. తాత్విక జ్ఞాన సాధన ద్వారా మాత్రమే మనస్సును శుద్ధిపరచుకొనే అవకాశం కలుగుతుంది. మనస్సు శుభ్రపడుటచేత మనస్సులో తాత్వికాలోచనలు ఉత్పన్నం అవుతాయి. ఆ దినచర్యలో తాత్విక భావాలతో చక్కని మనుగడసాగించగలుగుతారు. ఆ విధంగా సత్పురుషుడిగా చక్కని జీవితాన్ని గడిపే అవకాశం కలుగుతుంది. పవిత్రమైన జన్మ మానవజన్మ. ఈ క్షణం గతించిందంటే దానిని తిరిగి పొందలేము. కాబట్టి పుట్టుక మొదలుకొని అంత్యంవరకు ఉన్న మానవజన్మను ప్రతిక్షణం కూడా ఆనందమయం చేసుకొంటూ, సుఖంగా, సంతోషంగా జీవించగలిగే ఆధ్యాత్మిక తాత్విక జ్ఞానమార్గంలో ప్రయాణంచేస్తే ఎన్నో రకాలైన సమస్యలు, కష్టాలు, బాధలు అన్నీ అధిగమించే స్వశక్తి మనకు కలుగుతుంది. తద్వారా మనలో మానవత్వం ఏర్పడుతుంది. అటువంటి మానవత్వమును ప్రబోధించటానికి నాలుగవ

పీఠాధిపతివారి "కలికి భాగవతము" అనే దరువులరూపంలో ఉన్న కీర్తనలను చదివినట్లైతే ఒక్కొక్క కీర్తనలో జీవితం యొక్క అర్థం అది పరమార్థం రూపంలో ఏవిధంగా అన్వయింపబడి ఉంది అనే విషయం తెలియబడుతుంది. ఆ కీర్తనలు చదువుచున్నపుడు పారలౌకికమైన జీవన విధానం మనలో ఏర్పడుతుంది. ఆ విధంగా కొద్దిసమయం మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. మానసిక ప్రశాంతతచేత మనస్సుద్ధి ఏర్పడుతుంది. మనస్సుద్ధిచేత చక్కని ఆలోచనలు కలుగుతాయి. అప్పుడు మనం తాత్విక జీవన విధానాన్ని అలవరచుకొనే అవకాశం కలుగుతుంది. ఆ విధంగా ఆధ్యాత్మిక జ్ఞాననేత్రం పొందుతూ, జ్ఞాననేత్రం ద్వారా సామాజిక సేవా నేత్రం కూడా పొందేవిధానాన్ని అలవరచుకోవాలి. అప్పుడే నిజమైన పరిపూర్ణత్వం ఏర్పడుతుంది. మనకళ్ళకు అంధత్వం ఏర్పడినట్లైతే చీకటి ఏర్పడుతుంది. ఆ చీకటిని తొలగించే జ్ఞానజ్యోతిని ప్రకాశింపజేసుకోగలిగినట్లైతే అంధత్వం తొలగిపోతుంది. కాబట్టి ఆధ్యాత్మిక జ్ఞాన నేత్రం ద్వారా పరమాత్మ తనలోనే నిండియున్న విషయాన్ని గ్రహిస్తూ మానవత్వపు విలువలతో కూడిన సామాజిక దృక్పథంతో మనుగడ సాగించగలిగినట్లైతే సామాజిక సేవానేత్రం ఏర్పడుతుంది. ఈ రెండు నేత్రాలతో చూడగలిగినట్లైతే మనలో పరిపూర్ణత్వం ఏర్పడుతుంది. ఆ పరిపూర్ణత్వం మానవత్వానికి మార్గదర్శకంకాబడుతుంది. సర్వమత ధర్మాల విధానం ఒక్కటే అని తెలియజేసే 548 సంవత్సరాల ఘనచరిత్రగలిగిన పీఠం ఈ పీఠం యొక్క తత్వము. ఈనాటి సమాజంలో ఎక్కడ చూసినా ఒక మతంరూపంలోనో, ఒక కులంరూపంలోనో, ఒక ప్రాంతీయ తత్వం రూపంలోనో మనం విడిపోవుచున్నాము. కాని భగవంతుడు అనేక రూపాలలో ఉంటూ నేను ఒక్కడినే అని అన్నిధర్మాలలో చెప్పడం జరిగింది. కాని మత రూపాలలో మనం విభజించుకొంటున్నాము. ఆ విధంగా విడిపోయే విధానాన్ని తొలగించి ఏకత్వ ప్రతిపాదితమైన సమాజంగా తీర్చిదిద్ది ఇది భగవంతుడు ప్రసాదించిన పవిత్రమైన జన్మ. భగవంతుడిచ్చిన మేధాశక్తి ద్వారా ఆయా మత ధర్మాలలో ఉండే విషయాలను క్రోడీకరించుకొని ఏకత్వంగా చూసినట్లైతే

ఈశ్వరత్వం ఈ సృష్టిలో ఇమిడియున్నది. ఈ సృష్టి అంతా మనలోనే ఉంది. మనం అద్దం ముందు నిలబడినపుడు మన బింబం ప్రతిబింబరూపంలో ఏవిధంగా కనిపిస్తుందో అదేవిధంగా మానవుడనే ప్రతిబింబం సృష్టి అనే బింబరూపం ద్వారా కనిపిస్తున్నాడు. కాబట్టి బింబ ప్రతిబింబరూపాలుగా ఉన్న సృష్టి మానవుడు. కాని మానవుడు ఏమిచేస్తున్నాడు నా మతం గొప్ప, నేను గొప్ప అనే అరిషడ్వర్గ ప్రభావాలకు లోబడి అహంకారానికి గురికాబడుచున్నాడు. అహంకారం ఎంత పెద్ద వ్యక్తినైనా అథ:పాతాళానికి తోసేస్తుంది. అందుచేత అహంకారం ఎప్పుడు ఏ వ్యక్తికి, ఏ సమయంలో కూడా పనిచేయదు. అహంకారం వినాశనానికి కారణంకాబడుతుంది. క్రోధం (కోపం) ఆలోచనను కోల్పోయేటట్లు చేసి మన వినాశనానికి కారణభూతంకాబడుచున్నది. కాబట్టి మనం వినాశనాన్ని కోరుకోవటంలేదు. వికాసాన్ని కోరుకొంటున్నాము. వికాసాన్ని పొందాలి అన్నట్లైతే ఆధ్యాత్మిక జ్ఞాన ప్రయాణం సాగించాలి. ఆ జ్ఞానమార్గాన్ని తెలియజేసేవారే గురువులు అని చెప్పబడుచున్నారు. అటువంటి సద్గురువును ఆశ్రయించి జ్ఞానం ద్వారా మంచిని పొంది ఈశ్వరత్వం ఒక్కటే అనే విషయాన్ని గ్రహించగలిగినట్లైతే మానవజన్మ యొక్క అర్థం పరమార్థం అందరికీ తెలియబడి మనందరం భగవత్స్వరూపంగా ఉండే భగవత్ప్రసాదితమైన జన్మను సుఖవంతంచేసుకొందాం, ఆనందంగా, సంతోషంగా జీవిద్దాము అనే తాత్విక భావన మనందరిలో ఏర్పడుతుంది. ఆ భావనలో భాగస్వామ్యం అయిన ప్రకృతిని కూడా సంరక్షించుకోవాలి. కొన్నిచోట్ల అడవులు నరికివేస్తున్నారు. అడవి జంతువులు బయటకు వస్తున్నాయి. అవి మానవ నివాసాలపై దాడిచేస్తున్నాయి. అందుచేత వన్యప్రాణి సంరక్షణ నిమిత్తం అడవులను నరకవద్దు. అడవి జంతువులను చంపవద్దు అనే సందేశాన్ని ఈ కొండవాలు ప్రాంతంలో ఏర్పాటుచేయటం జరిగింది. అందుచేత వేసవికాలంలో ప్రతిఒక్కరు తమ ఇళ్ళ ముందు ఒక గిన్నెతో నీళ్ళను పెట్టి అక్కడ పక్షులకు ఆహారంగా చిరుధాన్యాలను వేసినట్లైతే అవి ఆహారాన్ని స్వీకరించి నీటిని త్రాగి వాటిని ఏర్పాటుచేసిన మనకు చక్కని జీవితాన్ని ఆరోగ్యాన్ని

ప్రసాదించు స్వామీ అని పశుపక్ష్యాదులు భగవంతుడిని మన తరపున కోరుకొంటాయి. ఆశీస్సును ప్రసాదింపజేస్తాయి. అదేవిధంగా మన గ్రామాలలో, పట్టణాలలో చలివేంద్రాలు ఏర్పాటుచేసి దాహార్తిని తీర్చటానికి ప్రయత్నంచేసినట్లైతే అది ఒక మహోన్నతమైన సామాజిక స్ఫూర్తి సామాజిక సేవ. నాలుక ఎండిపోతున్నపుడు కావలసింది ధనంకాదు. గుక్కెడు నీళ్ళుకావాలి. ఆ విధమైన సామాజిక సేవ చేస్తే అదియే భగవతత్త్వము. అదియే భగవంతుడు. అంటే సామాజిక సేవరూపంలో భగవత్తత్త్వం తెలియబడుతుందనే విషయాన్ని బౌద్ధ, జైన, హైందవ, క్రైస్తవ, ఇస్లాం ధర్మాలలో చెప్పబడిన అంశాలు. ఇక్కడ విన్న విషయాలు మరచి బయటకు వెళ్లి మన విషయాలు మనం చెప్పుకొంటున్నాము. ఇక్కడ విన్న విషయాలను పదిశాతమైన ఆచరిస్తే అర్థం పరమార్థం మన దగ్గరే ఉంటుంది. అటువంటి స్ఫూర్తిని కలిగించటానికి స్వామి ఈ రోజు మొక్కల పంపిణీ కార్యక్రమము చేపట్టడం జరిగింది. అందుచేత ప్రతి ఒక్కరు జీవితకాలంలో 120 మొక్కలు నాటినట్లైతే వాతావరణ కాలుష్యం నివారింపబడుతుంది. ఈ మధ్యకాలంలో వచ్చిన కరోనా వైరస్ చూసినట్లైతే ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థ మీద, ఆరోగ్య వ్యవస్థ మీద ప్రభావం చూపిస్తున్నది. ఈ రెండు నష్టాలు ఏర్పడటం వలన ప్రపంచానికి ఎంతో పెనుముప్పు దాపురించి ఉన్నది. అటు సమస్యలకు పరిష్కారం మన దగ్గరే ఉంది. వాయు కాలుష్యాన్ని నివారించటానికి మొక్కలను నాటాలి. కనుక ఈ వేసవికాలంలో పశుపక్ష్యాదులకు ఆహారాన్ని అందించి చలివేంద్రాలను ఏర్పాటుచేసి ఆ భగవత్కృపకు పాత్రులు కాలవలసిందిగా నా మనవి. సర్వేజనా సుఖినోభవంతు అని తమ ప్రసంగమును ముగించారు.

# మహాసభలు - 2020

## 9-2-2020 మధ్యాహ్నం సభాకార్యక్రమము

ఈ సభలో కుమారి జ్యోతి, మానవ జీవన విధానమునకు దశ, దిశ నిర్ధేశించే తత్వము ఈ పీఠం యొక్క తత్వము, అన్ని జన్మల కన్నా మానవజన్మ గొప్పది. మనస్సు ఇంద్రియాలపై నడిస్తే దుర్భరజీవితం గడుపవలసి ఉంటుంది అన్నారు.

**శ్రీ వేణుగోపాలశర్మ,** సద్గురువు సత్ అంటే శాశ్వతమైనది. గుణరహితమైనది తేజోమయమైనది. మంత్రమే గురువు గురువే మంత్రము. శిష్యునికి శాశ్వతమైన ముక్తి మార్గమువైపు నడిపే వారే సద్గురువర్యులు. శూన్యంలో సద్రూపమును చూపించు వారే సద్గురువు. తాను జగద్రూపంగా ఉండి శిష్యులను జగద్రూపంగా మార్చు వారే సద్గురువర్యులు. అశాంతిపోవాలంటే అజ్ఞానం పోవాలి. జ్ఞానాన్ని సద్గురువు ద్వారా మాత్రమే పొందగలమని అన్నారు.

**డా. ఎన్ రామగోపాలవర్మ,** ఈ సృష్టిలోని పంచభూతాలు మానవునిలోని పంచభూతాలు ఒక్కటే కాలాన్ని సద్వినియోగపరచుకోమని చెపుతున్నారు.

**శ్రీ ఆర్.కె. శివరామకృష్ణ,** మానవ జన్మ మోక్షం పొందటానికి వచ్చింది. మోక్షమును పొందాలంటే త్యాగిగా మారాలి. సంకల్పబలం గొప్పగా ఉంటే నీవు ఏదైనా సాధించగలవు. సహనం అనేది మానవజన్మకు అత్యంతావశ్యకమని అన్నారు.

**ఎస్.కె. అమీర్‌బాషా,** స్వామి ప్రవేశపెట్టిన త్రయీసాధన ఎంతో గొప్పది వారి అనుభవాలనే గ్రంథాలరూపంలో తెలియజేస్తున్నారు. కష్టములు పడకుండా బ్రహ్మవస్తువును తెలుసుకోలేము. మంత్రమే గురువు అంటే గురువు మనతోనే ఉన్నారని అర్థము. ఒక వేళ నీవు మరచిపోయినా ఆయన మన వెంటే ఉంటారని అన్నారు.

**వై. ఉమామహేశ్వరరావు,** కర్మయోగం విశిష్టతను శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీతలో తెలియజేసారు. “ద్వంద్వ భావాలు వదిలిపెడితే అంతా మంచే

జరుగుతుంది. కర్మ అనే దానిని ఫలాన్ని ఆశించి చేయకూడదు. యజ్ఞపూరితమైన కర్మలు గొప్పవి. జ్ఞానయజ్ఞమనేది ఉత్తమ కర్మ. దానిని త్రయీసాధన ద్వారా పొందగలమని అన్నారు.

**సూఫీసులేమాన్‌షా,** మనం ఎవరికైనా సేవచేస్తున్నపుడు నిస్వార్థంగా చెయ్యాలి. మంచి గురువు ద్వారానే ముక్తి లభిస్తుంది. గురువు లేని విద్య గుడ్డిది. ఈనాటి సమాజంలో మానవులలో అరిషడ్వర్గాలు స్వార్థం పెరిగిపోవుటచేత అశాంతికి, అలజడికి గురికాబడి ఉత్తమమైన మానవజన్మను సార్థక్యం చేసుకోలేకపోవుచున్నారని అన్నారు.

**స్వామి ప్రసంగము:** ఒత్తిడి అనే విషయంలోనే సమాజంలో అనేక రకాలైన అనైతికమైన మార్పులు ఏర్పడి, కాలుష్యం ఏర్పడి అనేక రకాలైన శారీరక, మానసిక రుగ్మతలకు గురికాబడుచున్నాడు మానవుడు. అటువంటి పరిస్థితుల నుండి మానవాళికి దిక్సూచిగా ఆధ్యాత్మిక తత్వం అనే ఔషధం ఈ పీఠం తత్వం ద్వారా ప్రసాదింపబడుచున్నది. ఈ పీఠంలో ఉన్న తత్వం మనలో ఉన్న జీవాత్మను పరమాత్మ స్వరూపిగా దర్శింపజేసే జ్ఞాన నేత్రాన్ని ప్రసాదించి తరింపజేస్తుంది. జ్ఞాననేత్రం ద్వారా మనలో ఉన్న దైవాన్ని మనం దర్శించగలుగుచున్నాము. జ్ఞాననేత్రాన్ని పొందియున్న శరీరం భౌతికరూపంలో మానవరూపం అని విశ్లేషించుకొంటున్నాము. ఆధ్యాత్మికపరమైన జీవన విధానంలో స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ శరీరాలుగా ఏర్పడినది. ఆ శరీరంవలన తాత్విక జ్ఞాననేత్రం ద్వారా తనలో ఉన్న తన జీవాత్మ పరమాత్మ స్వరూపము అనే విషయం తెలియబడుచున్నది. భౌతికమైన శరీరం అయితే దాన్ని మనం కళ్ళతో చూస్తున్నాము. ఈ శరీరం ఏరూపంగా ఉంది అని ఆధ్యాత్మిక కోణంలో ఆలోచించినట్లైతే స్థూలరూపంగా  ఉన్న శరీరం సూక్ష్మరూపంగా ఉంది. సూక్ష్మరూపంగా ఉన్న శరీరం కారణ శరీర రూపంగా ఉంది. కారణరూపంగా ఉన్న శరీరం మహాకారణ శరీరంగా నేను అనే ధ్వనిగా, పరమాత్మ స్వరూపంగా, తేజస్సుగా తెలియబడుచున్నది. **అంటే మహాకారణశరీరమే నేను అనే అభౌతికమైన**

**మహాతేజస్సుగా తెలియబడుచున్నది.** మహాకారణ శరీరం యొక్క అవస్థ ఎలా తెలియబడుచున్నది. అని సాధకుడు ప్రయత్నం చేసినట్లైతే మొట్టమొదట స్థూలానికి రావలసి యుంటుంది. స్థూలశరీరము కొన్ని వేల కోట్లజీవాణువుల రూపంగా నిర్ణయింపబడింది. అందుచేత ఈ సృష్టి స్థూలంగా ఉంది. మానవజన్మ స్థూలంగా తెలియబడుచున్నది. స్థూలంగా ఉన్న విషయాలన్నీ కూడా భౌతిక దృష్టికి తెలియబడుచున్నాయి. భౌతికంగా చూస్తున్న విషయాలన్నీ కూడా నిద్రావస్థలో స్వప్నాలు సామాన్య మానవుడికి గోచరిస్తాయి. సాధకుడికి అది దృశ్యంగాను తెలియపరచబడుచున్నాయి. సూక్ష్మ శరీరంలో భౌతిక శరీరంతో చూసిన విషయాలన్నీ కూడా సూక్ష్మ శరీరంతో చూడగలుగుచున్నాము. స్థూల శరీరంలో శ్వాస ఉంది. సూక్ష్మ శరీరంలో శ్వాసలేదు. కాని అభౌతికమైన శ్వాసతో స్థూలస్వరూపమైన విషయాలన్నీ చూస్తున్నాము. సూక్ష్మశరీరంలో ఉన్న మహోన్నతమైన శక్తి కారణశరీరంవైపు పయనింపజేస్తుంది. సద్గురువు ఆశ్రయం ద్వారా స్థూల, సూక్ష్మ శరీరాలకు కారణ భూతమైనది కారణ శరీరము అని చెప్పబడుచున్నది. కారణశరీరము స్థూలశరీరంలోనూ ఉంది. సూక్ష్మశరీరంలోనూ ఉంది. ఏవిధంగా ఉందని ప్రశ్నించుకొన్నట్లైతే, కారణశరీంలో అరిషడ్వర్గాల శక్తి ఇమిడి యున్నది. భ్రాంతి కుండలినీ, మాయ కారణ శరీరంలో ఇమిడియున్నాయి. అంటే కారణ శరీరం మానవుడిని జీవరహస్యం తెలుసుకొని ఈశ్వర రహస్యంవైపు ప్రయాణంచేసే స్థితికి మధ్య ఉన్న స్థితికి అవరోధం కలిగిస్తుంది. ఒక ప్రక్క ఈశ్వరుడు మరొక ప్రక్క భౌతిక జీవన విధానము ఈ రెండింటికీ మధ్య ఒక తెర కారణశరీరంగా ఉంది. సూర్యుని కాంతికి నల్లని మబ్బు అడ్డు వచ్చినపుడు సూర్యుని కాంతి మనకు కనపడదు. అదేవిధంగా మహాకారణ శరీరరూపంగా ఉన్న నేను అనే మహాతేజస్సుగా ఉన్న సూర్యుని శక్తిని, కారణశరీరం అనే నల్లని మబ్బు తేజస్సును కనిపించకుండా చేసే స్థితిని కలిగిస్తుంది. అంటే మిథ్యా స్థితి.

**"జగము మిధ్యని కొందఱు చాటుచుండ్రు**
**బ్రహ్మ మిధ్యనికొందఱు బలుకుచుందు**
**రిర్వురిటు మిధ్యావాదులే జగాన**
**నేదియును మిధ్యగాదు నీ వెఱిగియున్న".**

జగత్తు మిధ్య అని కొందరు చెపుతారు బ్రహ్మమిధ్య అని కొందరు చెపుతారు కాని బ్రహ్మమిధ్యగాదు, జగత్తు మిధ్యగాదు, జగత్తును ఆశ్రయించి బ్రహ్మ ఉంది. బ్రహ్మను ఆశ్రయించి జగత్సస్వరూపం ఉంది. ఈ రెండూ ఒక దానిని ఒకటి ఆశ్రయించియున్నాయి. ఈ రెండూ మిధ్య అని పలికే వారితో ఇది మిధ్యకాదు. నీలోనే ఒక దివ్య అభౌతికమైన ఈశ్వర శక్తి నిండియున్నది. కాని ఈశ్వరశక్తి తెలియబడాలి అన్నట్లైతే కారణశరీరాన్ని అధిగమించాలి. కారణశరీరం భ్రాంతి, మాయ, కుండలినీ రూపంగా ఉంది. అది ఎప్పుడూ కూడా అధోగతికి వెళ్ళేప్రయత్నాన్నే చేస్తుంది. తప్ప ఊర్ధ్వముఖానికి వెళ్ళకుండా అవరోధాన్ని కలిగిస్తుంది. దానికి ఒక తెర ఉన్నది. ఆ తెర అడ్డు

ఉండుటచేత చూడలేకపోవుచున్నాము. ఆ తెరను తొలగించుకొన్నట్లయితే జగత్తు బ్రహ్మరెండూ నీలోనే ఉన్నాయి. అనే విషయం తెలియబడుతుంది ఈ సృష్టి పంచభూతాత్మకంగా ఉంది. పంచభూతాలన్నపుడు నిప్పు, నీరు, గాలి, భూమి, ఆకాశము ఈ పంచభూతాత్మకమైన శక్తులు మానవునియందు పంచభూతాత్మకమైన స్వరూపాలుగా శబ్ద స్పర్శ, రూప, రస, గంధాలుగా తెలియబడుచున్నాయి. పంచభూతాత్మకమైన శక్తుల యొక్క శక్తిని తెలుసుకోగలిగినట్లైతే నీవే సృష్టిగా తెలియబడతావు అని చెప్పబడుతుంది.

**"నీలోనున్నవి పంచభూతములు వానిన్ దీక్షలో బట్టినన్**
**జాలున్ లోకము కాలమున్ మృతియుజంచత్ ద్వందసామాగ్రిపో**
**జాలున్ జీకటివిచ్చు నీమనసులో జాజ్జ్వల్యమానంబు నెం**
**తే లావెక్కు స్వతంత్రుడీవనుచు నీవే సృష్టిగా నెంచినన్".**

ఈ పంచభూతాలను దీక్షలోపెట్టి వాటిని అనుసరించి ప్రయాణం చేస్తే లోకము, కాలము, కుండలినీ ఇవన్నీ కూడా నీ ఆధీనంలోకి వచ్చినపుడు నీలో ఉన్న అద్భుతమైనశక్తి ఏదైతే ఉందో అది సృష్టిగా కూడా ఉన్నది. ఈ జగత్తనే స్వరూపానికి ఒక శక్తి కావాలి. పదార్థ శక్తి మిశ్రితమైనదే అణువు. కారణశరీరము, స్థూల సూక్ష్మ శరీరాలుగా ఉన్న సాధకుడిని ఒక తెరరూపంగా ఆవహించి బ్రహ్మ స్వరూపాన్ని గ్రహించకుండా నిరోధిస్తుంది. దాన్ని అధిగమించగలిగేశక్తి సద్గురువు కృపా కటాక్షవీక్షణాల ద్వారా పొందుచున్నాడు. అ సమయంలో గురుమహాశక్తి, భ్రాంతి మహాశక్తి తన ఎదురుగా వచ్చి కనిపిస్తాయి. అప్పుడు తనకు అందమైన, ఆహ్లాదకరమైన, ఆశాజనికమైన విషయం కనిపించే సరికి అది భ్రాంతిగా ఉందనే విషయాన్ని గ్రహించలేక దానిలో పడిపోయే ప్రమాదం ఉంది. అది అధోముఖానికి తీసుకొని వెళ్ళిపోతుంది. ఊర్ధ్వముఖానికి వెళ్ళిదర్శించాలి అనే తపన ఏదైతే ఉందో అది సద్గురువును ఆశ్రయించి ప్రయాణంచేసినట్లైతే ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేసినపుడు అక్కడ ఏదీ కనిపించదు శూన్యము. ఆ శూన్యంలో గురుమహాశక్తిని తెలుసుకొని తరించగలిగినపుడు అది శూన్యంలో సద్రూపం అనే విషయంగా తనకు పరిణామాన్ని కలిగిస్తుంది. ఆ బాటలో తాను ప్రయాణం చేసినపుడు తనలో ఉన్నతేజస్సూ పరమాత్మ స్వరూపంగా ఉన్నతేజస్సూ నేను అనే ధ్వనిగా తెలియపరచబడుతుంది. ఆ నేను అనే ధ్వని ఓంకారస్వరూపంగా ఉంది. ఆ ఓంకారం అకార, ఉకార, మకారముల కలయికగా ఉంది. అది అలీఫ్, లామ్, మీమ్ అని ఖురాన్‌లో చెప్పబడింది. అంటే ఓంకారరూపమైన నేను అనే ధ్వని స్వరూపం తేజస్సుగా ఉంది. ఆ తేజస్సుగా ఉన్నది శక్తిగా తెలియబడుచున్నది. **ఆ శక్తి, స్థూల, సూక్ష్మ, శరీరరూపాలుగా ఉన్న పదార్థాన్ని ఆశ్రయించి కారణశరీరంలో ఉన్న స్థితిని తొలగించినపుడు మహాకారణ శరీరంగా ఉన్న నేను అనే తేజస్సుతో మిళితమైనపుడు అది పరమాత్మ శక్తిగా తెలియబడుతుంది. అందుచేత జీవాత్మలో పరమాత్మ శక్తి నిండియున్నదనే విషయం అవగాహనకాబడుచున్నది.** అటువంటి సాధనా స్వరూపమైన విషయాన్ని స్వామి

మనకు సూక్ష్మమార్గంలో ప్రసాదిస్తున్నారు. అదియే త్రయిసాధనగా స్వామి మనకు సూక్ష్మమార్గంలో ప్రసాదిస్తున్నారు. త్రయిసాధన అన్నపుడు మంత్రసాధన, జ్ఞానసాధన, ధ్యానసాధన. మంత్రసాధన శారీరక తత్వానికి భుక్తిని ప్రసాదించి అరిషడ్వర్గాలను స్థాయిపరుస్తుంది. జ్ఞానసాధన ద్వారా అరిషడ్వర్గాలవలన భవిష్యత్తులో ఈ విధమైన నష్టం ఉంటుంది అని తెలియజేస్తుంది. ధ్యానసాధన శరీరతత్వాన్ని, మానసిక తత్వాన్ని ఏకీకృతం చేసి ముముక్షత్వాన్ని పొందితరించే మార్గాన్ని తెలియజేస్తుంది. అందుచేత ఆత్మ పరమాత్మ స్వరూపిగా స్థూల, సూక్ష్మ శరీరాలలో ఉండే విషయాలు, కారణశరీరంలో అధిగమింపజేసి మహాకారణ శరీరరూపంగా తెలియబడినపుడు పరమాత్మ స్వరూపం తెలియపరచబడుతుంది. ఒక పదార్థం మరొక పదార్థంగా మారటానికి మధ్యస్థంగా ఉన్నదే కారణశరీరం. జీవాత్మ, పరమాత్మ స్వరూపంగా మారేమధ్య స్థితిలో ఉన్న కారణ శరీరాన్ని గురుకృప శక్తి ద్వారా ఏవిధంగా అధిగమించవచ్చునే విషయం సాధకునికి పరీక్ష క్రింద అర్హత కలిగించి పరమాత్మ స్థితిగా మారే అవకాశాన్ని తెలియజేస్తుంది. అటువంటి స్థితిలో గురుతత్వమార్గంలో ప్రయాణం చేసేవారికే ఆ స్థితిని పొందే అవకాశం ఉంది. గురుతత్వం సామాన్యమైన విషయంగా ఉంటుంది. ఏవిధమైన ఆర్భాటాలులేని స్థితిగా ఉంటుంది. భ్రాంతి ఆశవైపు ప్రయాణంచేస్తుంది. అప్పుడు భ్రాంతిలో పడిపోయి అధోలోకానికి వెళ్ళిపోవటం జరుగుతుంది. వైకుంఠపాళిలో ఒకటవ స్థానం నుండి 99వ స్థానానికి వస్తాము. 99వ స్థానము దగ్గర ఒక పెద్దపాము కనిపిస్తుంది. అప్పుడు 99వ స్థానము నుండి తిరిగి ఒకటవ స్థానానికి వచ్చేస్తాము. ఆ విధంగా కారణశరీరం అనే విషయం ఒక పెద్ద పాముగా 99వ స్థానము నుండి 100వ స్థానానికి చేరేసమయంలో ఒకటవ స్థానానికి ఏవిధంగా పడిపోవుచున్నామో అదేవిధంగా కారణశరీరం అధోముఖంగా పయనింపజేసి చివరికి జడజన్మలకుపోయే పరిస్థితులను కలిగిస్తుంది. ఇక్కడ భ్రాంతి సాధకుడిని మరిపింపజేస్తుంది. భ్రాంతివదలిన తత్వమెవ్వనికి తెలుసు. భ్రాంతి తత్వం అంత బలీయంగా ఉంటుంది. అందుచేత భ్రాంతిని అధికమించేశక్తిని త్రయిసాధన ద్వారా పొంది తరించుట ద్వారా స్థూల, సూక్ష్మ, కారణ, శరీరరూపాలను

అధిగమించగలిగే శక్తిని ప్రసాదించేదే త్రయీసాధన. కాని ఈ బాటలో ప్రయాణం చెయ్యాలన్నట్లైతే ఎంతో కృషిచెయ్యవలసియుంటుంది. అటువంటి స్థితి నుండి సునాయాసంగా సంసార ధర్మాన్ని, సామాజిక ధర్మాన్ని ఆచరిస్తూ సూక్ష్మమార్గంలో ఆచరించే తపస్సును స్వామి మనకు త్రయీసాధన ద్వారా ప్రసాదించారు. అందుచేత ప్రతిరోజూ 15 నుండి 20 నిమిషాల కాలం త్రయీసాధన ఆచరిస్తే స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ శరీరాల బాటలో ప్రయాణం చేసినట్లవుతుంది. కాబట్టి దాని గురించి కొంత సమయం వెచ్చించగలుగుచున్నామా? లేదా? అనే ప్రశ్న మనమే వేసుకోవాలి. మన మనస్సే మనకు చక్కని సమాధానాన్ని చెపుతుంది. మనస్సు చెప్పిన సమాధానాన్ని పరిశీలించినట్లైతే ఆత్రయీసాధనలో ప్రయాణం చేస్తే రోజు రోజుకూ త్రయీసాధన అద్భుతమైన శక్తి స్థూల, సూక్ష్మ, కారణ, మహాకారణ శరీరములతో కూడిన బాటతో సమానమైన బాటగా త్రయీసాధన శక్తి మనకు ప్రసాదింపబడుతుంది. శరీరతత్వానికి మంత్రసాధన, మానసిక తత్వానికి జ్ఞానసాధన, ఆత్మ తత్వానికి ధ్యానసాధన. ఇది భౌతికవాదంలో శరీరతత్వానికి భుక్తి, మానసిక తత్వానికి తృప్తి, ఆత్మతత్వానికి ముక్తి అనే ఈ మూడూ పొందితరించగలుగుచున్నాము. భ్రాంతి మనలను పరీక్షిస్తున్నపుడు గురువు మంత్రస్వరూపంగా కనిపిస్తున్నారు. మంత్రమేగురువు గురువేమంత్రస్వరూపము జగత్తేమంత్రము మంత్రమే జగత్స్వరూపము. అందుచేత జగత్తు గురుస్వరూపంగా ఉంది. గురుస్వరూపం మంత్రస్వరూపంగా ఉంది కాబట్టి జగత్తు అనే సృష్టి ఏదైతే ఉందో అది మంత్రస్వరూపంగా ఉంది. మంత్రస్వరూపం గురుస్వరూపంగా ఉంది. మంత్రసాధన చేస్తున్నపుడు స్థూల, సూక్ష్మ శరీరాల రూపాలను మంత్రసాధనలో పొందుచున్నాము, మంత్రసాధన అంత్యపరిణామము జ్ఞానసాధన శక్తిని పొంది దాన్ని అనుసరించి ప్రయాణం చెయ్యటం ద్వారా కారణ శరీరం యొక్క అవస్థలు ఏవైతే స్థూల, సూక్ష్మ శరీరాలపై ప్రభావితం చేస్తాయో వాటిని అధిగమించవచ్చు. మంత్రసాధన, జ్ఞానసాధన ఏకీకృతంకాబడి అని మనలో ఉన్న జీవాత్మను పరమాత్మ స్వరూపంవైపు మార్చగలిగే ధ్యానసాధనవైపు మరల్చబడుచున్నాము. పరిణామం పొందుచున్నాము. జ్ఞాననేత్రం ద్వారా.

అందుచేత ఇటు భౌతికమైన విధానంలోనూ అటు అభౌతికమైన విధానంలోనూ రెండింటినీ అన్వయింపజేస్తుంది త్రయీసాధన. మంత్రసాధన, జ్ఞానసాధన, ధ్యానసాధన ఇది ఒక దానికొకటి అనుసంధానంకాబడి అంత్యపరిణామంలో నేననే ధ్వనిని తేజస్సుగా తనకు తెలియబడే జ్ఞాననేత్రాన్ని తెలియజేయుట జరుగుతుంది. అప్పుడు భౌతికం నుండి అభౌతికానికి వెళ్ళిపోవటం జరుగుతుంది. ఇక్కడ మిధ్యాస్థితి అనేది ఏదీ కూడాలేదు. మంత్రసాధన, జ్ఞానసాధన, ధ్యానసాధన ఒక దానితో ఒకటి అనుసంధానింపబడియుండుటచేత మిధ్యా అనే స్థితి ఏదియూలేదు. త్రయీసాధన గొప్ప అద్భుతమైనశక్తిని ప్రసాదింపజేస్తుంది. ఇది సులభంగా మనం ఆచరించటానికి అవకాశం ఉన్న అంశం. ఈ సాధన గురించి ఏకాంత ప్రదేశానికి వెళ్ళనవసరంలేదు. మన పూజాగదిలోనే త్రయీసాధన ఆచరిస్తే గురుతత్వం తెలియబడి భ్రాంతికి గురికాకుండా ఉండే అవకాశం కలుగుతుంది. ఆ ప్రయాణంలో గురువు యొక్క స్థితిని భౌతికంగాను, అభౌతికంగాను దర్శించే అవకాశం కలుగుతుంది. అటువంటి అద్భుతమైన త్రయీసాధనను ప్రతిరోజూ ఆశ్రయించి ధ్యానం యొక్క స్థితిని ఏవిధంగా ఆచరించే విషయంగా ఉన్నదనే విషయం ఆఖైలలీషా సద్గురువర్యుల ధ్యానమందిరంలో నేర్చుకొని మన పూజాగదిలో ధ్యానప్రక్రియలను ఆచరించినట్లైతే ధ్యానసాధన శక్తి తెలియబడుతుంది. జ్ఞానసాధన తత్వజ్ఞానము మాసపత్రిక, పీఠాధిపతులు రచించినగ్రంధాలు చదివి ఆచరించాలి. సద్గురువు ప్రబోధించిన మంత్రసాధన ఉదయం 11 సార్లు, రాత్రి 11 సార్లు మననం చేసుకొంటే మంత్రసాధన శక్తి తెలియబడుతుంది. ఈ విధంగా ప్రతిరోజూ మన దినచర్యను ఆచరించినట్లైతే మన దినచర్యలో వచ్చే అనేక అవాంతరాలను తొలగించుకొంటూ సద్గురుమూర్తి ఆశీస్సులు పొందితరించే అవకాశం మన అనుభవంలో మనకు తెలియబడుతుంది. అటువంటి మహోన్నతమైన ఆశీస్సును భౌతికంగాను, అభౌతికంగాను పొందుతూ త్రయీసాధన ఆచరిస్తూ సద్గురువు కృపకు పాత్రులు కావలసిందిగా నా మనవి. సర్వేజనా సుఖినోభవంతు అని తమ ప్రసంగమును ముగించారు.

## వీరంపాలెం సభా కార్యక్రమము

ది. 21-2-2020న మహాశివరాత్రి సందర్భంగా పశ్చిమగోదావరిజిల్లా, తాడేపల్లిగూడెం మండలం, వీరంపాలెం గ్రామములో శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయప్రాంగణములో శ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రిగారి ఆధ్వర్యంలో సభ ఏర్పాటుచేయబడినది. ఈ సందర్భంగా శ్రీ వెంకట రమణశాస్త్రిగారు మాట్లాడుతూ గురుసాంప్రదాయం మహోన్నతమైనది. శ్రీరామచంద్రమూర్తి, శ్రీ కృష్ణభగవానులకు వశిష్ఠుడు, సాందీపుడు గురువులుగా ఉండి జ్ఞానాన్ని బోధించారు. అటువంటి ఉత్కృష్టమైన స్థాయిగలిగిన డా॥ ఉమర్ ఆలీషాగారు మహాశివరాత్రి పుణ్యకాలంలో ఈ ఆలయప్రాంగణానికి రావటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ సభలో స్వామి ప్రసంగిస్తూ సద్గురు ప్రబోధితమైన జ్ఞానం ద్వారా మానసిక కాలుష్యాలు తొలగింపబడి మనశ్శాంతి ఏర్పడి సంతోషం, ఆరోగ్యం కలుగుతాయి. ఓంకారమనగా శారీరక, మానసిక, ఆత్మతత్వాల సమ్మేళనము. ఓంకారమనగా అకార, ఉకార, మకారముల కలయిక. శరీరతత్వానికి భుక్తి, మానసిక తత్వానికి తృప్తి ఆత్మతత్వానికి ముక్తిని ప్రసాదించు తత్వమే శివతత్వము. ఈశ్వరత్వము. ఈ మహాశివరాత్రి పుణ్యకాలాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగపరచుకోవలసిందిగా నా మనవి అని తమ ప్రసంగాన్ని ముగించారు.

## అనుభవము - 1

శ్రీ శ్రీ శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతుల పాదపద్మములకు నా నమస్కారములు నాకు పునర్జన్మనిచ్చిన మహానుబావులు. నా పేరు వేణి మాది పిఠాపురం. నాకు 2015 మార్చి 21న మ్యారేజ్ అయ్యింది. నాకు తెలియకుండానే నాకు కడుపులో నొప్పి వచ్చింది. గత రెండు రోజులుగా నేను కడుపు నొప్పితో బాధపడుతున్నాను. కడుపునొప్పి ఎక్కువ రావడంతో నేను మా అమ్మకు చెప్పాను. వెంటనే ప్రైవేట్ డాక్టరు చంద్రశేఖర్‌గారి దగ్గరకు వెళ్ళాము.

అక్కడ నేను కళ్ళు తిరిగి పడిపోయాను. డాక్టరుగారు చూసి బి.పి.డౌన్ అయ్యింది అని సిలాన్ బాటిల్స్ పెట్టారు. నాకు నైటంతా ఆ హస్పటల్‌లోనే ట్రీట్‌మెంట్ ఇచ్చి నాకు స్కానింగ్ రాసి సత్య స్కేనింగ్‌కి వెళ్ళి చేయించుకోమన్నారు. నన్ను మా అమ్మగారు కాకినాడ తీసుకువెళ్ళి సత్య స్కేనింగ్‌లో స్కేనింగ్ చేయించారు. అక్కడ వాళ్ళు చూసి మీరు మీ డాక్టర్‌ను కలవండి అని అన్నారు. డాక్టరుగారిని కలవడానికి వెళితే డాక్టరుగారు లేరు ఆ మరుసటి రోజు ప్రొద్దుట వెళ్ళాము. డాక్టరుగారు రిపోర్టులు చూసి పాపకి ఆపరేషన్ పడుతుందని చెప్పారు. వాళ్ళ నాన్న ఎక్కడ అని అడిగారు. మా నాన్నగారికి ఫోన్‌చేస్తే వారు హస్పటల్‌కి వచ్చారు. పాపకి పిండం గర్భసంచిలో పడకుండా పక్క ట్యూబ్‌లోకి వెళ్ళిపోయింది దాని వల్ల పాపకు ప్రమాదం పిండం పడిన ట్యూబ్ కూడ పగిలిపోయింది. పాపకు 70 నుంచి 80 వేలు వరకు అవుతాయన్నారు. పాప దగ్గర రక్తములేదు అని అన్నారు. మా నాన్నగారు నేను డబ్బులు ఎరంజ్ చేస్తాను. పాపకు వెంటనే ఆపరేషన్ చేయండి అని అన్నారు. డాక్టర్‌గారు నేను అయితే ఆపరేషన్ చెయ్యలేను నా దగ్గర ఐ.సి.యు లేదు పాపకు  ఆపరేషన్ చేసిన వెంటనే ఐ.సి.యులో రెండు రోజులు పెట్టాలి. నేను ఇక్కడ ఒక్కడినే డాక్టరును ఏదిఏమైనా కాకినాడలో డాక్టర్లు వెంటనే చూస్తారు. అక్కడకే నేను సీటు రాస్తున్నాను అని అన్నారు. ఈ విషయం విన్నాక చెప్పగానే నా తల్లితండ్రులు చెల్లెల్లు ఏడ్చారు నేను నాకేమి భయములేదు నా స్వామి ఉన్నారు అన్నాను నన్నుకాకినాడ తీసుకువెళ్ళారు కాకినాడలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. అక్కడ ఆటో అతన్ని మా నాన్నగారు అడిగితే అక్కడ ఎక్సిడెంట్ అని చెప్పారు. అక్కడ కారు బస్సు తగులుకొని కారులోని ఉన్న ఒక అతను చనిపోయాడు అతని కొడుకు తన తండ్రి ఉద్యోగం తనకు ఇస్తేనే అతను బాడీని తీస్తానన్నాడు. మేము ఆటో అతన్ని మా నాన్నగారు బాబు మేము అర్జెంట్‌గా ఎమర్‌జెన్సీ హస్పటల్‌కు వెళ్ళాలని చెప్పారు. పాపం ఆయన నేను తీసుకువెళ్తాను కంగారుపడకు అన్నయ్య అని అతను తీసుకువెళ్ళాడు. అక్కడ నాకు హస్పటల్‌లో వెంటనే ఆపరేషన్ చేసారు. అక్కడ నేను స్వామి, స్వామి అని

పిలిచాను. ఎవరమ్మ అని అడిగారు డాక్టరుగారు. మా పిఠాపురంలో నాకు ఉమర్ఆలీషాగారు ఉన్నారని చెప్పాను స్వామి నాకు వెంటనే నేను వచ్చాను అని అన్నారు. అంటే మత్తుడాక్టరుగారు రూపంలో వచ్చారు. వేణి నేను వచ్చాను కదా అని నీకు భయం లేదన్నారు. ఆపరేషన్ అయిన తరువాత స్వామి నన్ను లేపి వేణి నీకు ఆపరేషన్ అయ్యింది అని చెప్పారు. స్వామి వచ్చే నాకు ఆపరేషన్ చేసారు. నేను వెంటనే మా అమ్మగారితో అమ్మ నాకు స్వామి వచ్చి ఆపరేషన్ చేసారని చెప్పాను. నా స్వామి ఎప్పుడు నన్ను నా కుటుంబాన్ని చూసుకొని వస్తున్నారు స్వామి ఆశీస్సులు ఉండి నేను స్వామి సేవలో ఉండే భాగ్యము కల్పించవలసిందిగా కోరుకుంటూ

ఇట్లు

**స్వామి పాదరేణువు**

మండల నాగవేణి,

పిఠాపురం,

సెల్ నెం. 9989038344.

# కాంత - కనకము

మానవునియందు జ్ఞానదృష్టిలో యేకాంతముగ యేపర్వత ప్రాంతమునకో పోయి ఈశ్వరవిషయాన్ని సాధించినవాడే యోగియని అతనికే సర్వము తెలుసునని అతనిని యనుసరించినపుడు యతని వాక్కునుండి వచ్చుధ్వని ఉపనిషద్రూపమని యతని స్పర్శ తగిలితేనే ముక్తివచ్చునని నతనికి యీ సృష్టియందు ఆశయనే విషయమునుండదని నతనిని గ్రహించి యెవరైన భిక్షరూపములో పెట్టిన ఆరగించి కానినాడు సహించి యింత నీరుత్రాగి యుండగలడని చెప్పి ప్రచారము చేయు ప్రచారకులు వేనోళ్ళచాటుచు నాతడు వాఙ్మయముగయున్న వాటిని వల్లించి పలికిన పడికట్టుమాటలయందు అపారమైన నిగూఢమైన అర్థమున్నదని నటువంటి అర్థము కలిగిన మాటలు ఆనోటరావాలంటే అతనికి కాంతా కనకములయందు బలీయమైన విరక్తియుండి యుండాలి కాబట్టి ఆ పేర్కొన్న వ్యక్తియందు యీ రెండు విషయాలలో చెప్ప శక్తికానంత విరక్తికలదని ప్రచారము చేసెడివారు చెప్పు మాటలు విని ఓహో! మహానుభావుడని పూజించుచున్నారు. అతని రూప వర్ణన, పెద్ద గెడ్డంతో కూడిన జడలల్లిన తల, రుద్రాక్ష మాలలు కాషాయవస్త్రములు, నదికాని విధానములో గెడ్డము మీసము లేని బోడిగుండు కలిగి కాషాయ వస్త్రములు ధరించి దండ కమండలధారుడై నిమీలితలోచనములతో ఈశ్వరవిషయం పూర్తిగా గ్రహించినవాని వలె వారి ప్రసంగములలో వెల్లడించు యిలా చెప్పువారి పడికట్టుమాటలకు విభ్రాంతులై వారిని పూజనీయులుగ బ్రహ్మస్వరూపులుగ కామాది విషయషట్కములు నిర్జించిన వారిగ నిశ్చయించి అట్టివారియందు భక్తి విశ్వాసములను వెళ్ళడించుచున్నారు. ఇట్టివారు యీ కాలమునందు యోగులుగను బ్రహ్మస్వరూపులు గను వెలసియున్నారు.

**"ఏతద్విషయే తత్పూర్వం ప్రాచీనం"** ఇటువంటి వారే జ్ఞానవిషయం తెలిసినవారు అని నిశ్చయింపబోవునపుడు దీనికి పూర్వం జ్ఞానులు మహాఋషులు యిటువంటి విషయములో యుండి గ్రహించి లోకానికి వేద, ఉపనిషదాదిగా

గలిగిన మహత్తర జ్ఞానవిషమును వెళ్ళడించారా? అను ప్రశ్నవచ్చినప్పుడు ఆది ఋషియయిన వశిష్ఠ మహాఋషికి నూర్గురు కుమారులు నతని భార్య అరుంధతి. విశ్వామిత్రునకు శకుంతల కుమార్తె. వ్యాసునకు ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. శ్రీశుకుడు కుమారులు, ఈ తీరుననే ప్రతి మహాఋషి వేదవిహితమైన ప్రతి వాక్కును పలికిన ఋషులయొక్క చరిత్రలు కాంతలుకలిగియున్నట్లు చెప్పుచున్నది. అవతార పురుషులైన శ్రీరామ, బలరామ, కృష్ణులకు భార్యలు కలరు. ఆదం ప్రవక్త మొదలు మహమ్మదు ప్రవక్తవరకు ప్రతి ప్రవక్త సంసారులు. ఒక్క ఏసుక్రీస్తు తప్ప. ఆనాటికాలంలో పెండ్లి వయస్సు రాకపూర్వమే ఏసుక్రీస్తును శిలువ నెక్కించుటచేత నాతడు కాంతారహితుడైనాడు. ఈ విధంగానే ఉపనిషత్కారకులు కూడా అవివాహితులు కారు. బుద్ధుడు కూడా సంతానము కలిగినవాడు.

కానీ యీ కాలమందు కాంతా కనకములను విసర్జించినాడని ప్రతినొక్కరిని పేర్కొని వారి వారి రహస్యాన్వేషణ చేసినయెడల వారు చేసిన చేయుచున్న దురంతములు, వారు చేయు కామాది విషయగాథలు బయలుపడినప్పుడు ఆ విషయాలు తెలిసన హృదయాలను ధ్వనింపజేసినప్పుడు తెలియగలదు. వారికి పాదపూజరూపములో గురుదక్షిణ రూపములో లభ్యమైన ధనము తమ శిష్యులచే సంగ్రహింపబడి ఆ ధనము యినుపపెట్టెలోనికి వచ్చినప్పుడు బ్యాంకులలో వేసినప్పుడు గాని తాకుదురేగాని మనయెదుట నిరసనరూపంలో ముట్టుకొనరు. ఈనాటి కాలమందు కాంతా కనకముల నొల్లని వేషధారులను సోదా చేసినపుడు వారు గడించిన కనకరూపమైన ధనరాసులు ఎంతవిగా నున్నవో అవి వారిశక్తికి మనలెఖ్ఖకు మించియున్నట్లు తెలుసుకొనగలము. ఇటువంటి వ్యక్తులను కాంతా కనక విరక్తులని మోసపోయి వారిని తమ స్థానములో చేర్చినప్పుడు వారుచేయని దురంతకృత్యములు లెక్కపెట్ట సాధ్యముకానివిగ యున్నట్లు మనము ఆలకించుచునే యున్నాము. కాంతా కనకముల నొల్లని వేషధారణ గజదొంగలకు ఆకరమగుచున్న సంగతినిజము.

యధార్థమైన యోగరూపములోయున్న కాంతా కనకములనొల్లని వ్యక్తి పవిత్రమైన శీలరూపంలోయున్న సంసారి తనపత్నిగాయున్న వ్యక్తియందు తన విషయేచ్ఛలను నిర్వర్తించి ఆ రూపమున వచ్చిన సంతానపోషణకై శ్రమించిన ఆర్జనపైమోసి ఆ సంతానము కృతార్థులనుచేయు భారమును గూర్చి సాధనాపరుడై ఈశ్వరవిషయాన్ని గ్రహించిన అట్టివారు యితర కాంతలపైగాని యితరుల ధనముపైగాని అతని మనస్సు పోనివ్వడు, పోదు. అతడే కాంతా కనకములు రహితము చేసికొన్న యోగి.



ది. 27-2-2020 పిఠాపురం ఆర్.ఆర్.బి.
హెచ్.ఆర్. గవర్నమెంట్ హైస్కూల్‌లో ఉమర్
ఆలీషా రూరల్ డవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
కూలింగ్ ఆర్.ఒ. ప్లాంట్ శిలాఫలకమును
ఆవిష్కరించి సద్గురువర్యులు, మరియు
శ్రీ అహ్మద్ ఆలీషా, శ్రీ వేణుగోపాల్ పాఠశాల
ప్రదానోపాధ్యాయులు
శ్రీ హుస్సేన్‌షా, శ్రీ ఖలీల్‌షా

ది. 21-2-2020 తాడేపల్లిగూడెం మండలం,
వీరంపాలెం గ్రామంలో శ్రీ బాలాత్రిపుర సుందరి
సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణములో
సద్గురువర్యులను సన్మానించి
చిత్రపటమును అందజేయుచున్న
శ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి గారు





ది. 31-3-2020 కన్నాపురంలో ఉమర్ ఆలీషా
రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో
నిర్వహించుచున్న కుట్టు శిక్షణా కేంద్రములో
తయారు చేసిన 1000 మాస్కులను పోలీస్,
వైద్య ఆరోగ్య శాఖ మరియు పారిశుద్ధ్య సిబ్బందికి
అందజేయుచున్న పోలవరం ఎమ్మెల్యే
శ్రీ తెల్లం బాలరాజు గారు మరియు ట్రస్ట్ సభ్యులు

చీమలవారి గూడెంలో ఉమర్ ఆలీషా రూరల్
డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు
శిక్షణా కేంద్రములో మాస్కులను తయారు
చేయుచున్న కట్టా లక్ష్మి గారు మరియు
వారి బృంద సభ్యులు



# కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించుచున్న సేవా కార్యక్రమాలు



ది. 9-3-2020 అత్తిలిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో
కరోనా వైరస్ వ్యాధి నిరోధక ఉచిత హోమియో
మందులను పంపిణీ చేయుచున్న
శ్రీ కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే
తణుకు మరియు ట్రస్ట్ కార్యకర్తలు

ది. 25-2-2020 కాకినాడలో ట్రస్ట్ ఆధ్వర్యంలో
కరోనా వైరస్ వ్యాధి నిరోధక ఉచిత హోమియో
మందులను శ్రీ. ఎస్. అబ్రహాం,
జిల్లా విద్యాశాఖాధికారి వారికి పంపిణీ
చేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు





ది. 8-4-2020 పిఠాపురంలో
బార్ అసోసియేషన్ మరియు ఉమర్ ఆలీషా
రూరల్ డవలప్‌మెంట్ సంయుక్తంగా
కరోనా వైరస్ వ్యాప్తి నివారణా నిరోధక
ఉచిత హోమియో మందులు, మాస్కులు,
మరియు సబ్బులు కలిగిన 100 కిట్‌లను
పేద ప్రజలకు పంపిణీ నిమిత్తం 12వ అదనపు
జిల్లా జడ్జి శ్రీ సాల్మన్‌రాజు గారు,
శ్రీ హరిబాబు గారికి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి
అందజేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు

ది. 6-4-2020న కాకినాడలో ట్రస్ట్
ఆధ్వర్యంలో కరోనా వైరస్ వ్యాధి నిరోధక
చర్యలలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో
శ్రీ కరణం కుమార్, అదనపు సూపరిండెంట్
ఆఫ్ పోలీస్ వారికి 100 మాస్కులను
అందజేయుచున్న ట్రస్ట్ కార్యకర్తలు.



Posted on 10th Every Month, Postal Licence No. AP/KD-88/2018-2020
RNI.No. APTEL/2000/508-Dt. 14-3-2000

**BOOK-POST**
**(Printed Book)**

శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము వారి
యాజమాన్యమున వెలువడు ఆధ్యాత్మిక మాసపత్రిక

విడి ప్రతి వెల రూ. 10-00, సంవత్సర చందా రూ. 100-00
రెండు సంవత్సరముల చందా రూ. 200-00, జీవిత సభ్యత్వ చందా రూ. 1000-00
రాజ పోషకులు రూ. 5,000-00, మహారాజ పోషకులు రూ. 10,000-00
వలయువారు ఈ క్రింది చిరునామాకు M.O. / D.D. ద్వారా గాని, స్వయంగా గాని పొందవచ్చును.

ఎడిటర్, తత్త్వజ్ఞానము మాసపత్రిక, శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠము
పిఠాపురం - 533 450, తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఫోన్ : 08869-252426

## ప్రకటన

ప్రస్తుత పరిస్థితులలో తత్వజ్ఞాన మాస పత్రిక ముద్రణ మరియు పంపిణీ సాధ్యం కానందున పాఠకులకు ఏ విధమైన అంతరాయం లేకుండా ఏప్రిల్ 2020 నెల తత్వజ్ఞాన మాసపత్రికను "ఈ-పత్రిక" గాను మరి యు "శ్రవణ పత్రిక" గాను పీఠము వాట్సప్ గ్రూప్ ద్వారా ఈ నెల 10వ తేదీన విడుదల చేయబడును. పాఠకులు ఈ మార్పును గమనించగలరు. ఈ విషయము మీకు తెలిసిన పాఠకులకు కూడా తెలియజేసి సహకరించగలరు.

If undelivered please return to
**The Editor, Tathva Znanamu Monthly Magazine**
Sri Viswa Viznana Vidya Adhyatmika Peetham,
PITHAPURAM - 533 450, E.G.Dist. A.P., India.

Publisher : Dr. Umar Alisha, Printer & Address : V. Jagapathi Ramarao, Swamy Offset Printers, 2-3-120/A, Mekavari Street, Pithapuram - 533 450
Owner : Dr. UMAR ALISHA, Place of Publication : 11-3-42, Main Road, Pithapuram, Name of the Editor : Dr. UMAR ALISHA, 11-3-42, Main Road, Pithapuram